క్లుప్తంగా

పొలతలలో వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



పొలతలలో ధ్వజస్తంభం ప్రతిష్ట చేస్తున్న వేదపండితులు, భక్తులు

పెండ్లిమర్రి : పొలతల శైవ క్షేత్రంలోని మల్లేశ్వరస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం రాత్రి, బుధవారం ఆలయ చైర్మన్‌ రాజగోపాల్‌రెడ్డి, ఆలయ ఈఓ మహేశ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట వేడుకలు నిర్వహించారు. ధ్వజస్తంభం సమర్పించిన దాతలు చెన్నకేశవ నాయుడు, రమాదేవిలను ఆలయ కార్యనిర్వాహకులు ఘనంగా సత్కరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చక్రాయపేట : మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్‌ సీడీపీఓ పద్మావతి, చక్రాయపేట సూపర్‌వైజర్‌ హైమావతిలు తెలిపారు. మండలంలోని కె.రాజుపల్లె,(ఓసీ), బీఎన్‌ తాండా(ఎస్టీ), ముద్దప్పగారిపల్లె(ఓసీ), వడ్డెపల్లె(బీసీ–ఏ) స్థానాలు ఖాళీగా ఉన్నాయని వారు తెలిపారు. అర్హులై ఉండి ఆసక్తి గలవారు ఈనెల 6వ తేదీ లోపు తమ దరఖాస్తులను లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్‌ కార్యాలయంలో అందజేయాలన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్‌ నాగర్జున

ఎర్రగుంట్ల : మండల పరిధి పోట్లదుర్తి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం వద్ద బుధవారం కుష్టువ్యాధిపై ఎర్రగుంట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్‌ నాగర్జున అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో డీపీఎంఓ వీరభద్రయ్య, హెల్త్‌ ఎడ్యూకేటర్‌ వెంకటేశ్వర్లు, పీహెచ్‌ఎన్‌ వరదమ్మ, హెల్త్‌ సూపర్‌వైజర్‌ ఓబులేసు, హెల్త్‌ సెక్రటరీ ఆరోగ్యమ్మ, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ట్యాంక్‌ను నిర్మించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందిదజేస్తున్న మహిళలు

ఎర్రగుంట్ల : స్థానిక 15వ వార్డులోని మహాత్మనగర్‌ కాలనీలో బోరింగ్‌ వేసి మినీ నీటిట్యాంక్‌ను నిర్మించాలని ఆ వార్డు మహిళలు బుధవారం మున్సిపల్‌ కార్యాలయంలో మున్సిపల్‌ కమిషనర్‌ పి.జగన్నాథ్‌ను కలసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మనగర్‌ కాలనీలోని సర్వేనంబర్లు 506–1, 506–2లలో వీధికి అవసర నిమిత్తం అర్థ సెంట్‌ స్థలంను సంయుక్తంగా కొనుగోలు చేశామని అయితే ఇప్పుడు పక్క వీధిలో ఉన్న ఓ వ్యక్తి ఆ స్థలంలో పునాథులు వేస్తున్నారన్నారు. పునాధిని తొలగించి మాకు సంబంధించిన స్థలంలో బోరింగ్‌ వేసి నీటి ట్యాంక్‌ను నిర్మించాలని వారు కోరారు. దీనిపై కమిషనర్‌ స్పందించి సర్వే చేయించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలి

వేంపల్లి : విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలని మండల లిప్‌ మానిటరింగ్‌ అబ్జర్వర్‌ సి.శ్రీనివాసులు ఉపాధ్యాయులను కోరారు. బుధవారం మండల పరిధిలోని టి.వెలమవారిపల్లె గ్రామం ప్రాథమిక పాఠశాలలో లిప్‌ మానటరింగ్‌లో భాగంగా విద్యార్థుల గ్రేడ్‌ల గురించి ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులకు నేర్పుతున్న బోధనపై ఉపాధ్యాయులు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అందులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా బోధించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు అంశాలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఇప్పెంట, కాంపల్లి, సీకేదిన్నె, తాడిగొట్ల పంచాయతీలో గురువారం జరిగే గృహ సారథుల సమావేశానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్‌ రామాంజులురెడ్డిలు హాజరవుతున్నట్లు మండల కన్వీనర్‌ గూడ ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండల నాయకుల, నూతనంగా ఎన్నికైన సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు హాజరు కావాలన్నారు.

గడప గడపలో సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే డాక్టర్‌ మూలె సుధీర్‌రెడ్డి



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ముద్దనూరు : గ్రామాల్లో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్‌ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం మండలంలోని కొసినేపల్లె గ్రామంలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామస్తులు గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజి సౌకర్యం కల్పించాలని ఆయన దృషికి తేవడంతో స్పందించిన ఆయన మీ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఆయన మట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో అర్హులైన వారందరికీ నిష్పక్షపాతంగా పథకాలు అందుతున్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్‌ శ్రీధర్‌రెడ్డి, యూత్‌ అధ్యక్షుడు సుమంత్‌, పార్టీ నాయకులు రమణారెడ్డి, వాసుదేవరెడ్డి, తిరుమలరెడ్డి, మునిరెడ్డి, గౌతమ్‌రెడ్డి, గంగయ్య, గోపాల్‌, ఓబులేసు, రవిశంకర్‌రెడ్డి, నాగేష్‌, భాస్కర్‌రెడ్డి, శంకర్‌, రవి, మునయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జమ్మలమడుగు రూరల్‌ : వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్‌ మూలే సుధీర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గూడెంచెరువు గ్రామంలో స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు కిరణ్‌, స్వప్న తదితరులు చికిత్సలు అందించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వరరెడ్డి, రమణయ్య యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ రాజధానితో అందరికీ మేలు

పులివెందుల టౌన్‌ : విశాఖపట్టణాన్ని రాజధాని చేస్తే రాష్ట్ర ప్రజలందరికీ మేలు జరుగుతుందని.. అదే అమరావతి రాజధాని అయితే ఒక టీడీపీ నాయకులకే మేలు జరుగుతుందని మున్సిపల్‌ చైర్మన్‌ వరప్రసాద్‌ బుధవారం పులివెందులలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్టణాన్ని రాజధాని చేయడం ఎంతో శుభపరిణామమన్నారు. విశాఖను రాజధాని చేయడంతో ఎన్నో పరిశ్రమలు వస్తున్నాయన్నారు. దీంతో నిరుద్యోగ సమస్య ఉండదన్నారు. ఏపీలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రెండు రోజుల క్రితం ఢిల్లీలో ముఖ్యమంత్రి విశాఖను రాజధాని చేస్తానని ప్రకటించడంతో టీడీపీ నాయకులు తెల్ల ముఖాలు వేశారన్నారు. రాజధాని నిర్ణయం ప్రభుత్వానిదే అని కోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయమన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాలు సమాన స్థాయిలో అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి ధ్యేయమన్నారు. విశాఖను రాజధాని చేయడంపట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు.

ప్రారంభమైన విగ్రహ పునఃప్రతిష్ట వేడుకలు



మాట్లాడుతున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

సింహాద్రిపురం : మండలంలోని రావులకొలను పంచాయతీ పరిధిలోని భానుకోటేశ్వరస్వామి క్షేత్రంలో పునర్వార్త ప్రతిష్ట మరియు కుంభాభిషేక మహోత్సవ వేడుకలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు సురేష్‌ శర్మ, వీరభద్ర శర్మలు వేద పారాయణం, గోపూజ, దేవతా అనుజ్ఞ ఆలయ ప్రదక్షిణ, భూతబలి తదితర పూజలు చేశారు. సాయంత్రం అంకురార్పణ, అగ్ని మథనం, అగ్ని ప్రతిష్టాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తులు సహకరించాలి

సింహాద్రిపురం : భానుకోట శైవ క్షేత్ర నూతన ఆలయాల విగ్రహ పునఃప్రతిష్ట సమయంలో భక్తులు సహకరించాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి కోరారు. బుధవారం స్థానిక భానుకోట క్షేత్రంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా ప్రతిష్ట వేడుకలలో తీసుకోవాల్సిన చర్యలు, క్యూలైన్ల ఏర్పాటు, వసతుల ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ మహేశ్వరరెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రెడ్డి, పులివెందుల ఆర్డీఓ వెంకటేశులు, డీఎస్పీ శ్రీనివాసులు, రూరల్‌ సీఐ బాలమద్దిలేటి, ఆర్‌అండ్‌బీ డీఈ సిద్ధారెడ్డి, తహసీల్దార్‌ మహబూబ్‌బాషా, ఎంపీడీఓ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హిందూ సంస్కృతి సంప్రదాయాలు ఎంతో ఘనమైనవి



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న విరజానందస్వామి

చక్రాయపేట : హిందూ సంస్కృతి సంప్రదాయాలు ఎంతో ఉన్నతమైనవని వాటిని ప్రతి వ్యక్తి ఖచ్చితంగా పాటిస్తే జన్మ పరిపూర్ణం అవుతుందని బ్రహ్మంగారిమఠం మండలం తోట్లపల్లె అచలానంద ఆశ్రమ పీఠాధిపతి స్వామి విరజానంద తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని చక్రాయపేట మండల కేంద్రంలో వెలసిన శ్రీవేంకటేశ్వర, రాచరాయస్వామి ఆలయాల ప్రాంగణం వద్ద నుంచి మండల వ్యాప్తంగా 18 రోజుల పాటు నిర్వహించే ప్రచార రథయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా కేంద్రానికి చెందిన వైద్యుడు కొప్పల బయారెడ్డి హాజరయ్యారు. అనంతరం శ్రీదేవి, భూదేవి, సమేత శ్రీవేంకటేశ్వరుడు, శివ పార్వతుల ఉత్సవ మూర్తులతో కూడిన ప్రచార రథాన్ని వారు ప్రారంభించారు. ప్రచార రథానికి మార్లెమడక, బీసీ కాలనీ, కొండవాండ్లపల్లె, అద్దాలమర్రి, చెరువు కాంపల్లె గ్రామాలో ప్రజలు ఘణంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ ఓబుళరెడ్డి, మాజీ చైర్మన్‌లు రామాంజనేయరెడ్డి, చక్రపాణిరెడ్డి, హరనాథరెడ్డి, ఏపీ ఆగ్రోస్‌ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నకృష్ణారెడ్డి, పురోహితులు అనంత పద్మనాభ శర్మ, ప్రజలు పాల్గొన్నారు.

కమలాపురం తహసీల్దార్‌గా నారాయణరెడ్డి



బాధ్యతలు తీసుకుంటున్న నారాయణరెడ్డి

కమలాపురం : స్థానిక మండల తహసీల్దార్‌గా ఎంవీఎస్‌ నారాయణరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లాలో జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా వల్లూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన కమలాపురంకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న అమరేశ్వరీ వల్లూరుకు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన నారాయణరెడ్డి మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు, రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరు తమ పరిధిలోని సచివాలయాలు, కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. మీ స్థాయిలో లేని సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. సమయపాలన పాటించి ప్రజలకు సేవ చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీటీ ఇస్మాయిల్‌, ఆర్‌ఐలు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

మామిడిలో బూడిద తెగుళ్లపై జాగ్రత్తలు పాటించాలి

పెండ్లిమర్రి : మామిడి తోటలు సాగు చేసే రైతులు బూడిద తెగుళ్లపై జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని ఉద్యానశాఖ హెచ్‌ఓ సింధూరి అన్నారు. మండలంలోని నందిమండలం గ్రామం పొలాల్లో బుధవారం తోటబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి తోటలు పూతదశ, కాయ దశలో ఉన్నందున మంచు, చలి వాతావరణంలో ఎక్కువగా బూడిద తెగులు, ఆకు మచ్చ తెగుళ్ల వచ్చే అస్కారం ఉందన్నారు. వాటిని తక్షణం నివారిస్తే లాభాలు పొందవచ్చునన్నారు. అనంతరం రైతులు మామిడి తోటల్లో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

కార్మిక ప్రజావ్యతిరేక బడ్జెట్‌

కమలాపురం : 2023–24 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ పార్లమెంటులో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ కార్మికులకు, ప్రజలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉందని సీపీఐ ఏరియా కార్యదర్శి పి.చంద్రశేఖర్‌ తెలిపారు. బుధవారం కమలాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మోదీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌ పూర్తిగా కార్మికులకు, ప్రజలకు వ్యతిరేకంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కడప ఉక్కు ఫ్యాక్టరీకి అవసరమైన నిధులను రాబట్టడంలో ఎంపీలు పూర్తిగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు. ఈ బడ్జెట్‌లో సైతం రూ.61వేల కోట్ల ప్రభుత్వ ఆస్తులు అమ్మాలని ప్రతిపాదించడం దురదృష్టకరమన్నారు. ఈ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను తిరస్కరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మాజీ ఎంపీటీసీ మృతి

వేముల : మండలంలోని కొండ్రెడ్డిపల్లె గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సాలవేముల పక్కీరయ్య(65) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు.

ఈయన 2014లో నల్లచెరువుపల్లె ఎంపీటీసీగా పనిచేశారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, ఎంపీటీసీ నరసింహారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు గంగిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాజారెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటనారాయణ, వర్రా నారాయణరెడ్డి, లక్ష్మిరెడ్డిలు పక్కీరయ్య మృతదేహానికి నివాళులర్పించారు.

సర్వభూపాల.. వేంకటరమణ



సర్వభూపాల వాహనంపై సతీసమేతంగా శ్రీవేంకటరమణస్వామి

పులివెందుల టౌన్‌ : సర్వభూపాల.. శ్రీవేంకటరమణ..గోవిందా..గోవిందా అంటూ భక్తులు స్వామివారిని ఆరాధించారు. పులివెందుల నడిబొడ్డులో వెలసిన శ్రీవేంకటరమణస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం శ్రీవారు కల్పవృక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం 6గంటలకు ఊంజల్‌సేవ నిర్వహించి స్వామి వారికి పట్టు పీతాంబరాలను సమర్పించి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం సతీసమేతుడై స్వామివారు సర్వభూపాల వాహనంలో పురవీధులలో ఊరేగుతుంటే భక్తులు నీరాజనాలు అర్పించారు. ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, తోమాలసేవ, సహస్త్ర నామార్చన, నివేదన, నిత్య హోమం, కలశారాధన, ఇత్యాది కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు నిర్వహించారు. ఉభయదారులతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కరాటే పోటీలలో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో కరాటే మాస్టర్‌, తదితరులు

వేంపల్లె : ఇంటర్‌ స్టేట్‌ కరాటే పోటీలలో వేంపల్లె విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు జెన్‌ సిటిర్యూ కరాటే స్కూలు మాస్టర్‌ విజయ్‌ తెలిపారు. కర్నూలు జిల్లాలో గత 29వ తేదీన ఇంటర్‌ స్టేట్‌ కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో వేంపల్లె విద్యార్థులు అహీల్‌, మేఘన, అనూ ఎంజెల్‌, భరత్‌, నవ్యతేజలు బంగారు, వెండి పతకాలు సాధించారు. వీరి ప్రతిభపట్ల కడప స్పోర్ట్స్‌ కరాటే అసోసియేషన్‌ అధ్యక్షుడు మాస్టర్‌ విజయ్‌ హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ముద్దనూరు : మండల పరిధిలోని చెన్నారెడ్డిపల్లె గ్రామంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలనుంచి ప్రారంభమయ్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్‌ మూలె సుధీర్‌రెడ్డి పాల్గొంటారని పార్టీ మండల కన్వీనర్‌ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

వల్లూరు : మండలంలోని పెద్ద లేబాక, బక్కిరెడ్డిపల్లె గ్రామాల సరిహద్దున నూతనంగా నిర్మించిన శ్రీ సిద్ధేశ్వరస్వామి ఆలయంలో శ్రీ సిద్ధేశ్వర, పార్వతీదేవి, గణపతి, సుబ్రమణ్య స్వామి, నంది, నాగులు విగ్రహ, ధ్వజ ప్రతిష్టా కార్యక్రమాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు శేఖర్‌ శర్మ ఆధ్వర్యంలో గడియారం ప్రసాద్‌ శర్మ బృందం గణపతి పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు.

సీఐ బదిలీ

ముద్దనూరు : స్థానిక అప్‌గ్రేడ్‌ పోలీసుస్టేషన్‌లో సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మోహన్‌రెడ్డి బదిలీ అయ్యారు. ముద్దనూరు నుంచి కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు రూరల్‌ సీఐగా ఆయన బదిలీ అయినట్లు ఉన్నతాధికారులనుంచి ఆదేశాలు అందాయి. గత ఏడాది జనవరి 27న ఆయన విధుల్లో చేరారు. బుధవారం సీఐ విధుల నుంచి రిలీవ్‌ అయ్యారు.

ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు సాగాలి



కేజీబీవీలో విద్యార్థులకు మెటీరియల్‌ అందజేస్తున్న ప్రాజెక్ట్‌ అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

వల్లూరు : ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించడానికి పట్టుదలతో కృషి చేయాలని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్‌ అధికారి డాక్టర్‌ అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. వల్లూరులోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, గంగాయపల్లెలోని ఏపీ మోడల్‌ స్కూల్‌లో శ్రీగాయత్రి సేవా ట్రస్ట్‌ వారి ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పదవ తరగతి మోడల్‌ పేపర్స్‌, పరీక్షల మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా హాజరైన ప్రాజెక్ట్‌ అధికారి మాట్లాడుతూ కృషి, ఆసక్తి, పట్టుదల, తపనలు విద్యార్థుల విజయానికి సోపానాలన్నారు. మీ తల్లిదండ్రుల పేదరికం పోవాలంటే అది కేవలం విద్యతోనే సాధ్యమని, విద్యకు మించిన ఆస్తిలేదన్నారు. గాయత్రి సేవా ట్రస్ట్‌ వారు విద్యాభివృద్ధికి తోడ్పాటు నందించే సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్‌ చైర్మన్‌ వెంకటేశ్వర్లు, కేజీబీవీ స్పెషలాఫీసర్‌ నసీమున్నీసా, ఏపీ మోడల్‌ స్కూల్‌ ప్రిన్సిపాల్‌ సురేష్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శనగ పంటలో పంట కోత ప్రయోగం



తూకం వేస్తున్న శనగ దిగుబడులను పరిశీలిస్తున్న మండల ఇన్‌చార్జి, తదితరులు

వేముల : మండల పరిధిలోని పెర్నపాడు గ్రామంలో బుధవారం వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి సమక్షంలో శనగ పంటలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. శనగ పంటలో దిగుబడుల ఆధారంగా రైతులకు ఇన్సూరెన్స్‌ వర్తిస్తుంది. దీంతో ఇన్సూరెన్స్‌ కంపెనీ ప్రతినిధి, వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో పెర్నపాడు గ్రామంలో పంట కోత ప్రయోగం చేయగా.. 5 కిలోల దిగుబడి వచ్చిందని ఏడీఏ అశోక్‌రెడ్డి తెలిపారు. ఈ పంట కోత ప్రయోగంలో వచ్చిన దిగుబడులను ప్రామాణికంగా తీసుకుంటారు. ముందుగా గుర్తించిన సర్వే నెంబర్‌లో 5x5 విస్తీర్ణంలో పంటను పీకివేసి దిగుబడులను లెక్కించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట నారాయణ, మల్‌రెడ్డి, ఏఓ చెన్నారెడ్డి, వీఏఏ మాధవి, రైతులు పాల్గొన్నారు.

నిర్దేశించిన ఇళ్ల లక్ష్యాలను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న మండల స్పెషలాఫీసర్‌ రవీంద్రనాథరెడ్డి

వేంపల్లె : ప్రభుత్వం నిర్దేశించిన ఇళ్ల లక్ష్యాలను పూర్తి చేయాలని మండల స్పెషలాఫీసర్‌ రవీంద్రనాథరెడ్డి కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో సచివాలయాల ఉద్యోగులతో హౌసింగ్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న గృహాల నిర్మాణాలపై సమన్వయంతో పనిచేయాలన్నారు. లబ్ధిదారులు త్వరితగతిన గృహ నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. అలాగే లబ్ధిదారులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో శ్రద్ధతో పాటు సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్‌, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు

నల్లపురెడ్డిపల్లె విద్యార్థుల ఎంపిక



ప్రతిభ చూపిన విద్యార్థులతో హెడ్మాస్టర్‌ కమలనాథశర్మ, తదితరులు

పులివెందుల రూరల్‌ : జాతీయస్థాయి పోటీలకు నల్లపురెడ్డిపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెడ్మాస్టర్‌ కమలనాథశర్మ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గతనెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో పాఠశాల నుంచి ప్రవల్లిక, వరలక్ష్మి, గణేష్‌, మహేష్‌లు మంచి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలలో పాల్గొనే జట్టులో సభ్యులుగా ఎంపికయ్యారన్నారు. వీరి ఎంపికపట్ల హెడ్మాస్టర్‌ కమలనాథశర్మ, జిల్లా సైన్స్‌ ఆఫీసర్‌ మహేశ్వరరెడ్డి, పీడీ రమణారెడ్డి, పాఠశాల సిబ్బంది అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి క్రీడా పోటీలకు వేంపల్లె విద్యార్థులు

వేంపల్లె : జాతీయస్థాయి టార్గెట్‌ బాల్‌ క్రీడా పోటీలకు శ్లోకా పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్‌ నవనీశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం వేంపల్లెలో ఆయన మాట్లాడుతూ విజయవాడలో ఎస్‌జీఎఫ్‌ స్కూలు ఆఫ్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి టార్గెట్‌ బాల్‌ పోటీలలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు అభినవ్‌, వెంకటతేజ, అశ్వినిలు ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థుల ఎంపికపట్ల పాఠశాల కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపాల్‌ రమేష్‌, పీఈటీ నారాయణ నాయక్‌, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించండి



ఉపాధ్యాయురాలిని ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్‌ నాయకులు

పులివెందుల : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డి కోరారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలు, బాలికల జూనియర్‌ కళాశాల, డిగ్రీ కళాశాల, పలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, బ్యాంక్‌లలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డి వైఎస్సార్‌టీఎఫ్‌ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఎఫ్‌ నాయకులు వెంకటనాథరెడ్డి, ఆకుల సుభాష్‌ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



రామసంజీవరెడ్డి(ఫైల్‌)

మైలవరం (జమ్మలమడుగు రూరల్‌): అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మైలవరం మండలంలో చోటు చేసుకొంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఉన్నాయి. మైలవరం మండలం కర్మలవారిపల్లె గ్రామానికి చెందిన యర్రంరెడ్డి రామ సంజీవరెడ్డి(35) (వార్డ్‌ మెంబర్‌)కు 2 ఎకరాల భూమి ఉంది. అందులో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సాగు కోసం అప్పు చేశాడు. దీనిని తీర్చేందుకు భార్య క్రిష్ణకుమారి నగలు కూడా విక్రయించాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ వాగ్వాదాలు జరిగేవి. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి పురుగుల మందు తాగాడు.గమనించి కుటుంబ సభ్యులు జమ్మలమడుగులోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ విషయమై ఎస్‌ఐ రామకృష్ణను వివరణ కోరగా పూర్తి వివరాలు తెలియవలసి ఉందన్నారు.

నేటి నుంచి లూర్దుమాత తిరునాల

కడప కల్చరల్‌ : కడప నగరం మరియాపురంలోని లూర్దుమాత దివ్యక్షేత్రంలో గురువారం నుంచి ఈ నెల 11వ తేది వరకు తిరునాల నిర్వహించనున్నట్లు మరియాపురం క్యాథడ్రల్‌ చర్చి విచారణ గురువులు పాదర్‌ బిరుసు రాజా తెలిపారు. బుధవారం మరియాపురం పాత చర్చి ఆవరణలో వారు తిరునాల కమిటీ సభ్యులు, సహాయక గురువు చంద్రతో కలిసి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1933లో కడప నగరంలో లూర్దుమాత పుణ్యక్షేత్రం వెలిసిందని, అప్పటి నుంచి అన్ని మతాలు, కులాల వారిని కలుపుకుని ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గురువులు దివ్యబలిపూజ నిర్వహిస్తారని తెలిపారు. గురువారం సాయంత్రం 5.30 గంటలకు చర్చి ఆవరణలో గురువులు పతాకావిష్కరణ నిర్వహిస్తారని, ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష హాజరవుతారన్నారు.